అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 3 సంచిక -94 శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts





రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి


WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103


# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి



బీఆర్ఎస్ పై జనాగ్రహంఫ్లాష్ సర్వేలో అదే వెల్లడి..

మూడ్రోజుల ఆ పార్టీ తీరుపై ప్రజల్లో అసహ్యం

శాసనసభను అడ్డుకొనేందుకు ఫాంహౌజ్‌లోనే కుట్ర

ఈ పరిణామాలు మనకే అనుకూలం

కుట్రలను సభ్యులంతా ఐక్యంగా తిప్పికొట్టారు

పోలీసుల్లో కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డే కనిపించాడుడ అందుకే ఆక్రోశంతో దాడులు

వచ్చే రెండేండ్ల మీ పనితీరు అత్యంత కీలకం

గెలుపోటములకు అదే గీటురాయి : సీఎల్పీ భేటీలో సీఎం ఏ రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)**
అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున శాసనసభ ప్రధాన ద్వారం వద్ద, లోపల, బయటా కొనసాగిన పరిణామాలపై బీఆర్ఎస్ నాయకుల తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దీనిపై ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫ్లాష్ సర్వే నిర్వహించామని చెప్పారు. గురువారం హైదరాబాద్ లోని అసెంబ్లీ కమిటీ హాల్ లో ముఖ్యమంత్రి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం వారికి దిశా **మిగతా 2లో...**

# పటిష్ఠమైన రక్షణ అవసరం

మైనర్ల సోషల్ మీడియా వాడకం...

పటిష్ఠమైన రక్షణ అవసరమన్న సుప్రీంకోర్టు

మైనర్లు సోషల్ మీడియా ఖాతాలు తెరవకుండా నిషేధించాలని సుప్రీంకోర్టులో పిటిషన్

కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఒప్పందాలు చేసుకోలేరని పిటిషనర్ వాదన

పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ

భారత్‌లో కొన్ని పటిష్ఠమైన రక్షణ చర్యలు అవసరమని చీఫ్ జస్టిస్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)**
సోషల్ మీడియా ఖాతాల వినియోగం అంశంలో మైనర్లపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం గురువారం నోటీసులు జారీ చేసింది. భారత కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఎటువంటి ఒప్పందాల్లోనూ భాగస్వాములు కాలేరని, అలాంటప్పుడు సోషల్ మీడియా ఖాతాలు తెరిచే సమయంలో ఆన్‌లైన్ ఒప్పందాలను వారు ఎలా అంగీకరిస్తారని పిటిషనర్ ప్రశ్నించారు. **మిగతా 2లో...**

# బ్రిక్స్ వైపే అందరి చూపు

సదస్సుకు సిద్ధమైన ఢిల్లీ

నేడు రష్యా, ఇరాన్ అధ్యక్షుల రాక ,మోడీతో ప్రత్యేక భేటీ




**న్యూఢిల్లీ సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)**భారత్ అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ సమావేశాల వేదికకు కౌంట్ డౌన్ షురూ అయ్యింది. ఈనెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే సదస్సులో బ్రిక్స్ సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాలు, ఆహ్వానిత దేశాల ప్రతినిధులూ పాల్గొననున్నారు. ఈ సదస్సులో ప్రధానంగా ప్రపంచ ఆర్థిక వృద్ధిని మరింత సమ్మిళితంగా మార్చేందుకు అవసరమైన సహకారం, ఆవిష్కరణలు, స్థిరత్వం, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో 18వ బ్రిక్స్ లీడర్స్ సమ్మిట్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ , ఇరాన్ అధ్యక్షుడు**మిగతా 2లో...**

# నేడు బ్యాంక్ ఉద్యోగుల సమ్మె

పని దినాలు తగ్గించాలి..పలు అంశాలపై ఆందోళన

వరుసగా నాలుగురోజుల పాటు స్తంభించనున్న కార్యకలాపాలు




**హైదరాబాద్ :సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)**
బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) సెప్టెంబర్ 10 నుంచి దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఐదు రోజుల పనిదినాల అమలు, పనితీరు ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ)లో వివక్ష తొలగింపు తదితర డిమాండ్లపై సెప్టెంబర్‌లో రెండు విడతలుగా సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఇది వరకు హెచ్చరించింది. తొలుత సెప్టెంబర్ 11న ఒకరోజు దేశవ్యాప్త సమ్మె జరగనుందని యూఎఫ్‌బీయూ వెల్లడించింది. **మిగతా 2లో...**

# మండలిలో రసాభాస..

22ఏ భూములపై చర్చకు డిమాండ్.. బీఆర్ఎస్ వాకౌట్

చైర్మన్ పోడియం వైపు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు

22ఏ భూములపై చర్చకు అనుమతించవపోవడంతో వాకౌట్ చేసిన సభ్యులు

మార్షల్స్ వ్యవహరించిన తీరుపై మధుసూదనాచారి మండిపాటు



తెలంగాణ శాసనమండలిలో 22ఏ నిషేధిత భూముల వివాదంపై ఈరోజు తీవ్ర గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ రికార్డులు, 22ఏ భూములకు సంబంధించిన సమస్యలపై తక్షణమే పూర్తిస్థాయి **మిగతా 2లో...**

# చంద్రబాబు 'వాటర్ మ్యాన్'

సాగునీటి రంగంలో సీఎం కృషికి దేశం గుర్తింపు: ఆర్థిక మంత్రి పయ్యావుల

ముఖ్యమంత్రిని 'వాటర్ మ్యాన్'గా కీర్తించిన 'ఎకనమిక్ టైమ్స్'

కలెక్టర్ల సదస్సులో ఈ విషయాన్ని ప్రస్తావించిన మంత్రి పయ్యావుల

సాగునీటి రంగంలో కృషికి సీఎం చంద్రబాబుకు స్టాండింగ్ ఓవేషన్

డీఎస్సీపై వాస్తవాలు వివరించిన మహిళా అధికారులను అభినందించిన సీఎం



2లో.

# త్వరలో ఆరు డీఏలు

ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ


ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో జేఏసీ చర్చలు

పీఆర్సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు

ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు

ఉద్యోగుల పక్షాన ఉంటానని సీఎం హామీ

**హైదరాబాద్ సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)**
ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు.
పీఆర్సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం..**మిగతా 2లో...**



# కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు

కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఎఫ్ఐఆర్

అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు

భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు



2లో.

# రూ.250 కోట్ల విలువైన భూమికి రూ.7 కోట్లా?

బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎక్కడికి పోయాయి

సీఎం అన్నదమ్ములకు రూ.వందల కోట్ల విలువైన భూములా.. !

ప్రజా సంక్షేమానికి పైసల్లేవా.. దొంగలను పట్టాల్సిన హోంమంత్రి అమిత్ షా ఎక్కడ?

ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ మాయాజాలం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి టెస్సెరాక్ట్ కంపెనీకి కేటాయించిన భూమి వద్ద బీఆర్ఎస్ నిరసన




2లో.

## చాకలి ఐలమ్మ పోరాటం యువతకు స్ఫూర్తిదాయకం



**హసన్‌పర్తి/ సెప్టెంబరు 10, (జర్నలిస్ట్ వార్త):**
పోరాటాల పురిటిగడ్డ వరంగల్ నేలపై జన్మించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని హసన్‌పర్తి మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ మాట్లాడుతూ.. నాటి విసునూరు రామచంద్రారెడ్డి దొరల దౌర్జన్యాలను ఎదిరించి ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. రజాకార్లను ఎదురించి పోరాడిన ఆమె ధైర్యసాహసాలు నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొత్తకొండ సుభాష్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నరేష్, రాజు, రాజేందర్, బిక్షపతి, కలువచర్ల సుదర్శన్, సంపత్ తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కూన మల్లమ్మ కుటుంబానికి రావుల రవిచంద్రరెడ్డి పరామర్శ



**కేసముద్రం/ సెప్టెంబరు 10 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూన భద్రాద్రి మాతృమూర్తి, ప్రముఖ విలేకరి కూన శ్రీనివాస్ నానమ్మ కూన మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రావుల రవిచంద్రరెడ్డి గురువారం కల్వలలోని వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో నాయకులు గొర్రె వెంకన్న, కముటం పెద్దస్వామి, కముటం చిన్నస్వామి, మూరగుండ్ల గాలయ్య, తూడి బిక్షమయ్య, కూన మల్లేశం, కూన లక్ష్మణ్, కొమ్మినేని సుధాకర్, కూన సారయ్య, కూన నారాయణతో పాటు కల్వల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# వాహనం అమ్మారా.. పేరు మార్చారా?

**ఆర్టీఏ రికార్డుల్లో యాజమాన్య బదిలీ తప్పనిసరి**

**తెల్లకాగితం అగ్రిమెంట్‌తో బాధ్యత తీరదు**

**మహబూబాబాద్ డీటీఓ శంకర్‌నాయక్ సూచన**



**మహబూబాబాద్/ సెప్టెంబరు 10 (జర్నలిస్ట్ వార్త):**
వాహనాన్ని విక్రయించిన తర్వాత ఆర్టీఏ రికార్డుల్లో యాజమాన్య బదిలీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్‌నాయక్ సూచించారు. వాహనం అమ్మినట్లు తెల్లకాగితంపై అగ్రిమెంట్ చేసుకోవడం, డబ్బులు తీసుకోవడం మాత్రమే సరిపోదన్నారు. రికార్డుల్లో పేరు మారకపోతే భవిష్యత్తులో జరిగే ప్రమాదాలు, నేరాలకు పాత యజమాని ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు.

**గంజాయి తరలింపుతో చిక్కులు**

గౌతమ్ అనే వ్యక్తి ఫైనాన్స్‌పై ఆటో కొనుగోలు చేసి, ఈఎంఐలు చెల్లించలేక మరో వ్యక్తికి విక్రయించాడు. అయితే ఇద్దరి మధ్య తెల్లకాగితంపై అగ్రిమెంట్ మాత్రమే జరిగింది. ఆర్టీఏ రికార్డుల్లో యాజమాన్య బదిలీ జరగలేదు. ఆ తర్వాత అదే ఆటోలో గంజాయి తరలిస్తుండగా భద్రాచలంలో పోలీసులు పట్టుకున్నారు. రికార్డుల్లో ఆటో గౌతమ్ పేరుతో ఉండటంతో ఆయనపై కేసు నమోదై ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పెండింగ్ ఈఎంఐల కోసం ఫైనాన్స్ సంస్థ నుంచి కూడా ఒత్తిడి వచ్చింది.

**విక్రేత అప్రమత్తంగా ఉండాలి**

వాహనం విక్రయించిన తర్వాత కొత్త యజమాని పేరుపై ఆర్టీఏ రికార్డుల్లో బదిలీ పూర్తయిందా లేదా విక్రేత స్వయంగా నిర్ధారించుకోవాలని డీటీఓ సూచించారు. వాహనం ప్రమాదానికి గురైనా, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఉపయోగించినా రికార్డుల్లో ఉన్న యజమానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. యాజమాన్య బదిలీ పూర్తయినట్లు నిర్ధారణ పత్రం పొందిన తర్వాతే విక్రయ ప్రక్రియ పూర్తయినట్లు భావించాలని స్పష్టం చేశారు.

## ఫ్లైఓవర్‌పై బైక్ అదుపుతప్పి మహిళకు తీవ్రగాయాలు

**సకాలంలో స్పందించిన 108 సిబ్బంది**




**కేసముద్రం/ సెప్టెంబరు 10 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మండల కేంద్రంలోని ఫ్లైఓవర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్పనపల్లి గ్రామానికి చెందిన హైమ అనే మహిళ తీవ్రంగా గాయపడ్డారు. వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం ఒక్కసారిగా అదుపుతప్పి కిందపడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్ర గాయాలైన ఆమె రక్తమడుగులో స్పృహతప్పి పడిపోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే ఇనుగుర్తి 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ ప్రభాకర్, పైలట్ ప్రశాంత్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. రక్తస్రావంతో ఉన్న హైమకు ఈఎంటీ ప్రభాకర్ అక్కడికక్కడే అత్యవసర ప్రథమ చికిత్స అందించారు. అనంతరం పైలట్ ప్రశాంత్ అంబులెన్స్‌లో ఆమెను మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి అత్యవసర వైద్యం అందించడంతో మహిళ ప్రాణాపాయం నుంచి బయటపడిందని స్థానికులు తెలిపారు. 108 సిబ్బంది ప్రభాకర్, ప్రశాంత్‌ల సేవలను బాధితురాలి బంధువులు, స్థానికులు అభినందించారు.

# నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదే

**సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు**

**సెప్టెంబర్ 11న జరిగే ప్రారంభ వారోత్సవాలకు తక్కళ్లపల్లి రాక**

**సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి**




**హనుమకొండ బ్యూరో /సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త);**నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదేనని, తెలంగాణ యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. గురువారం గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో సిపిఐ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించినా కూడా తెలంగాణ ప్రాంతం నైజాం రాజు ఆధీనంలో ఉండి నియంత, నిరంకుశ పాలన వల్ల భూస్వాములు, పటేల్, పట్వారి లు గ్రామాలలో తమ ఆగడాలు పెట్రేగి పోతున్న సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, వెట్టి చాకిరి, బానిసత్వంకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూం మొయినుద్దీన్ పిలుపునిచ్చారని తెలిపారు. ఆ పిలుపునందుకుని 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని, 3000 గ్రామాలను విముక్తి చేసిందని, 4500 మంది కమ్యూనిస్టులు తమ రక్తాన్ని చిందించి ప్రపంచ చరిత్రను సృష్టించారని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితమే 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమయిందని కొనియాడారు. నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర ముమ్మాటికి కమ్యూనిస్టులదే అన్నారు. తెలంగాణ యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు, దానిలో భాగంగా సెప్టెంబర్ 11న హనుమకొండ జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నుండి ఏకశిల పార్క్ టాను నాయక్ విగ్రహం వరకు వందలాది మందితో ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నారని తెలిపారు. సెప్టెంబర్ 11న జరిగే ప్రారంభ కార్యక్రమాన్ని, సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జిల్లా వ్యాప్తంగా జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రద చేయాలని వారు ప్రజలను కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, గుంటి రజిత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతల నివాళి**

**తల్లాడ/సెప్టెంబరు 10 (జర్నలిస్ట్ వార్త):**




వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగు లక్ష్మారెడ్డి అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం తల్లాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. నిజాం పాలనలో భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీ, పేద రైతులపై అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. 'నా భూమి.. నా పంట.. నా హక్కు' అనే నినాదంతో అన్యాయానికి ఎదురు నిలిచిన ఆమె పోరాటం తెలంగాణ రైతాంగ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఐలమ్మ ధైర్యం, ఆత్మగౌరవం, త్యాగాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. తెలంగాణ చరిత్రలో ఆమె పోరాట ప్రాధాన్యాన్ని యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దిరిశాల నరసింహారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, మారెళ్ల మల్లికార్జునరావు, గ్రామ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసఫ్, వెంకటనారాయణరెడ్డి, బొడ్డు వెంకటేశ్వరరావు, ఆదూరి దాసురావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యూఆర్ కోడ్, పోస్టర్లతో హెచ్ఐవీపై అవగాహన



**మహబూబాబాద్ /సెప్టెంబరు 10 (జర్నలిస్ట్ వార్త):**
హెచ్ఐవీ నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ సూచించారు. గురువారం మహబూబాబాద్ ఐడీఓసీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో హెచ్ఐవీ అవగాహన కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ విధానాన్ని వినియోగించి ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించాలని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. కురవి, నెల్లికుదురు, మరిపెడ, కేసముద్రం, తొర్రూరు మండలాల్లో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

**విద్యార్థుల్లో చైతన్యానికి పోటీలు**

పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన కల్పించేందుకు క్యూఆర్ కోడ్ ప్రచారంతో పాటు డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్ పోటీలు, ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో హెచ్ఐవీ నివారణపై చైతన్యం పెంపొందించేందుకు వైద్య సిబ్బంది చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు.
సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ అర్జున్, జ్యోతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజ్‌కుమార్‌తో పాటు పలువురు వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదల సేవకే ఇశ్రాయేలు చారిటబుల్ ట్రస్ట్

**నిరుపేద వృద్ధురాలికి వీల్‌చైర్, దుప్పట్లు, దోమతెరలు పంపిణీ**




**వైరా/సెప్టెంబరు 10 (జర్నలిస్ట్ వార్త):**
నిరుపేదలకు అండగా నిలిచి సేవా కార్యక్రమాలు చేపట్టేందుకే ఇశ్రాయేలు చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ ఖమ్మంపాటి ఇశ్రాయేలు తెలిపారు. గురువారం వైరా మండలం నారపునేనిపల్లికి చెందిన నిరుపేద వృద్ధురాలు దుగ్గిరాల రాములయ్యకు ట్రస్ట్ ఆధ్వర్యంలో వీల్‌చైర్, దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇశ్రాయేలు మాట్లాడుతూ ప్రార్థించే పెదాల కంటే సాయం చేసే చేతులు మిన్న అని అన్నారు. తోటి వారిని మానవత్వంతో ఆదుకోవాలనే లక్ష్యంతో తమ సేవా సంస్థ ద్వారా నిరుపేదలను గుర్తించి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో అట్టడుగు వర్గాలకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై పేదలకు చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆధూరి యోనా, లక్ష్మయ్య, రంగమ్మతో పాటు స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు పటిష్ట భద్రత

**కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి : ఎస్పీ డా. శబరీష్**





**మహబూబాబాద్/ సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):**
రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఆయన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గణేష్ విగ్రహానికి ఆన్‌లైన్ ద్వారా అనుమతులు తీసుకుని, వివరాలను నమోదు చేసి జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. ప్రధాన రహదారులకు ఇబ్బంది కలిగేలా విగ్రహాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు నిర్వాహకులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో నీటి వసతి, వాహనాల రాకపోకలను ముందుగానే పరిశీలించాలని ఆదేశించారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, శాస్త్రీయ పద్ధతుల్లో ఆధారాలు సేకరించి పక్కాగా ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని ఎస్పీ సూచించారు. సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య యాప్‌లను సమర్థంగా వినియోగించి కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు.

# విశాల సహకార సంఘం చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డి

## నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



**ఎల్కతుర్తి/సెప్టెంబరు 10 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలంలోని ది విశాల సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, డైరెక్టర్లు ఆయనను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సంఘానికి చైర్మన్‌గా అవకాశం కల్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్, డైరెక్టర్లకు ఇంద్రసేనారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నూతన పాలకవర్గం సహకారంతో సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సభ్యుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంఘ ఆదాయాన్ని పెంచేలా సూపర్‌మార్కెట్, పెట్రోల్ బంక్ తదితర వ్యాపార కార్యకలాపాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా సంఘ సేవలను విస్తరిస్తామని పేర్కొన్నారు.

**డైరెక్టర్లుగా బాధ్యతల స్వీకరణ**

సంఘ డైరెక్టర్లుగా చల్ల ధనలక్ష్మి, మద్ది రాములు, ఇనుగాల సుధాకర్, మోడెం రాజయ్య, వీరమల్ల ముకుందారెడ్డి, శనిగరపు స్వరూప, ఏడేళ్ల అశోక్‌రెడ్డి, తంగళ్లపల్లి కొమురయ్య, పుల్లూరి నర్సింగరావు, తిరుపతి బక్కయ్య, చిర రాజయ్య తదితరులు బాధ్యతలు చేపట్టారు.

**వివాదాలకు ముగింపు పలకాలి**

ది విశాల సహకార సంఘం గతంలో ఆర్థిక వ్యవహారాలపై వివాదాలను ఎదుర్కొన్నట్లు సభ్యులు తెలిపారు. గత పాలకవర్గం హయాంలో సంఘంలో ఆర్థిక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. సుమారు రూ.3.50 కోట్ల మేర తేడాలు ఉన్నట్లు అప్పట్లో రైతుల సమావేశాల్లో చర్చకు వచ్చినట్లు సభ్యులు తెలిపారు. ఈ వ్యవహారంలో కొంత మొత్తం సంఘానికి జమ అయినట్లు వారు పేర్కొంటున్నారు. అయితే దీనిపై అధికారిక విచారణ నివేదికలు, పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉందన్నారు. గత వివాదాలకు ముగింపు పలికి సంఘాన్ని లాభాల బాటలో నడిపించాలని సభ్యులు కోరుతున్నారు. రైతులకు రుణ సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు సంఘ ఆదాయ వనరులను పెంచాలని సూచిస్తున్నారు. ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత పాటించి, భవిష్యత్తులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నూతన పాలకవర్గం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

## వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**మిర్యాలగూడ/ సెప్టెంబరు 10 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. శాసనసభ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) సూచనల మేరకు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు, యువ నాయకుడు బత్తుల ఈశ్వర్ గణేష్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మౌయిజ్, కోడిరెక్క ఇంద్రకుమార్, పార్టీ కౌన్సిలర్లు, నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు, ఐలమ్మ అభిమానులు పాల్గొన్నారు.

# నూతన డైరెక్టర్లకు గ్రామస్తుల సన్మానం



**ఎల్కతుర్తి/ సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ది విశాల సహకార సంఘం అధ్యక్షుడిగా ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వివిధ గ్రామాలకు డైరెక్టర్లను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా దామెర గ్రామ డైరెక్టర్లుగా చల్ల ధనలక్ష్మి, మద్దె రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
నూతన డైరెక్టర్ల ఎన్నిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్లు మాట్లాడుతూ సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు సభ్యుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. సంఘంలో పెండింగ్‌లో ఉన్న రుణాలను వసూలు చేసి ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు.

# చాకలి ఐలమ్మ వర్ధంతి ఘనంగా

## భూస్వామ్య పెత్తందారులపై తిరుగుబాటు చేసిన వీరవనిత



**మధిర/ సెప్టెంబరు 10 (జర్నలిస్ట్ వార్త):**
వీరవనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని మధిర నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మధిర మార్కెట్‌యార్డు సెంటర్‌లోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ.. తన భూమి, పంట కోసం స్థానిక దేశ్‌ముఖ్, పట్వారీ దౌర్జన్యాలను ఎదిరించి ప్రాణాలకు తెగించి పోరాడిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. అప్పటి ఆంధ్ర మహాసభలో సభ్యురాలిగా కొనసాగిన ఆమె అనంతరం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాగిన సాయుధ రైతాంగ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. నిజాం నిరంకుశ పాలన, రజాకారుల దమనకాండ, భూస్వామ్య పెత్తందారుల అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ రైతాంగ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. భూమి కోసం పోరాడిన విప్లవ యోధురాలిగా చాకలి ఐలమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ టౌన్ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, కార్యదర్శి చట్టు వెంకటేశ్వర్లు, మధిర రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మార్నీడు పుల్లారావు, తెలుగు మహిళా నాయకురాలు మేడేపల్లి రాణి, సీనియర్ టీడీపీ నాయకులు చెరుకూరి కృష్ణారావు, బోడేపూడి వెంకటేశ్వరరావు, ఈదర వెంకటేశ్వరరావు, నాగులోంచ శ్రీను, కేశవపట్ల రామయ్య, యడవల్లి నాగభూషణం, పాశం రామనాథం, వీరవల్లి కోటేశ్వరరావు, చెన్నం స్వామి, చటారి ముసిలి, చిరపంగి ఆశీర్వాదం, బోనాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి




**నర్సంపేట/ సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. దొరలు, రజాకారుల అరాచకాలను ఎదిరించి బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని పేర్కొన్నారు. మహిళా శక్తిని చాటిన ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు.
కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి సంగెం రమేష్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, రజక సంఘం నర్సంపేట పట్టణ అధ్యక్షుడు కొల్లూరి లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడు రాయరాకుల సారంగం తదితరులు పాల్గొన్నారు.

# కిట్స్ వరంగల్‌తో సెంట్రల్ ఇండియా ఎంవోయూ

## ఏఐ నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ






**హసన్‌పర్తి/ సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):**
కిట్స్ వరంగల్‌లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఏఐఎంఎల్) విభాగం, హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ సంస్థ సెంట్రల్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఏఐ ఆవిష్కరణలు, అనుభవపూర్వక అభ్యాసం, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఈ ఒప్పందం దోహదపడుతుందని కిట్స్ అదనపు కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వి.సతీష్‌కుమార్ తెలిపారు. కిట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 10, 11 తేదీల్లో ట్రైసిటీ ఏఐ హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల నుంచి 1,000 మందికిపైగా విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. జెనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐపై అవగాహనతో పాటు వాస్తవ సమస్యలకు పరిష్కారాలు రూపొందించే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఇండియా సహ వ్యవస్థాపకుడు జి.సాయికృష్ణ, కిట్స్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్‌రెడ్డి, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ ఎ.జ్యోతి ప్రభ, అధ్యాపకులు, డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

# ఓయూ స్నాతకోత్సవంలో తాళ్ల అజయ్‌కు డాక్టరేట్



**నర్సంపేట/సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):**
చెన్నారావుపేట (రాజీవ్‌నగర్ కాలనీ)కి చెందిన తాళ్ల యాకయ్య, కరుణశ్రీ దంపతుల కుమారుడు తాళ్ల అజయ్ ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ శివప్రతాప్ శుక్లా అధ్యక్షత వహించగా, భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైస్‌చాన్సలర్ ప్రొ. కుమార్ మొలుగరం సమక్షంలో అజయ్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు.

**తెలంగాణ ఉద్యమంపై పరిశోధనకు గుర్తింపు**

'రోల్ ఆఫ్ స్టూడెంట్స్ ఇన్ తెలంగాణ మూవ్‌మెంట్ (19562014) అంశంపై చేసిన పరిశోధనకు అజయ్ ఈ డాక్టరేట్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విద్యా ప్రస్థానంలో అండగా నిలిచిన గురువులు, బంధుమిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ సాధించడంతో సామాజిక సేవ పట్ల తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన విద్యార్థులు, ఉద్యమకారులకు ఈ డాక్టరేట్‌ను అంకితం చేస్తున్నట్లు అజయ్ పేర్కొన్నారు.

# క్రీడా ప్రతిభకు బహుమతులు



**సత్తుపల్లి/సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి మండల స్థాయిలో ప్రభుత్వం నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విశ్వశాంతి విద్యాలయ విద్యార్థులకు గురువారం పాఠశాలలో బహుమతులు అందజేశారు. పాఠశాల యాజమాన్యం మెడల్స్ అందజేసి విద్యార్థులను అభినందించింది. పోటీల్లో ప్రతిభ చూపిన గోవర్ధన్ జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. మెడల్స్ సాధించిన వారిలో ఉదయ్ భార్గవ్, రామ్‌చరణ్, గోపీచంద్, భార్గవ్, వికాస్, సుశాంత్‌బాబు, రిషి తదితరులు ఉన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం పాఠశాలకు గర్వకారణమని హెడ్మాస్టర్ నాగేశ్వరరావు, యాజమాన్యం సత్యనారాయణ పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని తెలిపారు.

# 22ఏ భూముల సమస్య పరిష్కరించాలి

## కలెక్టరేట్‌కు బీజేపీ భారీ ర్యాలీ




**ఖమ్మం/సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):** 22ఏ జాబితాలో భూములను చేర్చడం వల్ల భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మంలో భారీ ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు, పుల్లారావు యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ, ఉదయ ప్రతాప్, ఈ.వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.
సత్తుపల్లి నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వ వైఖరికి నిరసన తెలిపారు. ధర్నా అనంతరం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని 22ఏ భూముల సమస్యపై వినతిపత్రం సమర్పించారు.
22ఏ జాబితాలో భూముల చేర్పుపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన భూ యజమానుల హక్కులను పరిరక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ వీరంరాజు, ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, మండల అధ్యక్షులు సాలి శివకృష్ణ, బుర్ర నరసింహారావు, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్.కే. రహమతుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు చీకటి వసంతరావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.
అధ్యక్షుడికి సన్మానం.
కార్యక్రమం అనంతరం మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్.కే. రహమతుల్లా ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావును శాలువాతో ఘనంగా సత్కరించారు.

## బడుగుల ఆత్మగౌరవ ప్రతీక
# వీరనారి చాకలి ఐలమ్మ.



**బయ్యారం/,సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)**తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బయ్యారం గ్రామపంచాయతీలో ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కిషన్ నాయక్,ఉపసర్పంచ్ ఏనుగుల ఉమా మాట్లాడుతూ నైజాం నిరంకుశ పాలనకు,భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు.ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని వారు పేర్కొన్నారు.మహిళల హక్కుల కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య,కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, ఏనుగుల రంజిత్,గ్రామస్థులు పాల్గొని ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు.

## అణగారిన వర్గాల స్ఫూర్తిప్రదాత చాకలి ఐలమ్మ.

### -సర్పంచ్ ప్రవీణ్ నాయక్



**బయ్యారం/,సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం గంధంపల్లి-కొత్తపేట గ్రామపంచాయతీలో ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ ఆమె విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ ధైర్యసాహసాలు, త్యాగం నేటి తరానికి ఆదర్శమని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుల పెద్దలు మాచర్ల సుక్కయ్య, కందకట్ల రాములు, కాంగ్రెస్ నాయకులు కారుబోతుల రామ్మూర్తి, చల్లా సురేష్, భూక్య శ్రీను, పసుపులేటి సతీష్, బుర్ర దుర్గారావు, పుల్లూరి బాలరాజు, గ్రామ యువకులు, ప్రజలు పాల్గొని అంజలి ఘటించారు.

# కోయగూడెం వాగు బ్రిడ్జి స్థలాన్ని పరిశీలించిన ఐటీడీఏ అధికారులు.

### -పనులు వేగవంతం చేయాలని అధికారులకు సర్పంచ్ విజ్ఞప్తి.



**బయ్యారం/,సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం కోయగూడెం పంచాయతీ పరిధిలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని స్థానిక ప్రజలు,ప్రజాప్రతినిధులు కోరారు.ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ప్రత్యేక చొరవతో ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరైన విషయం విధితమే.ఈ నేపథ్యంలో ఐటీడిఏ అధికారులు ఎస్‌ఈ సన్నీ కుమారి,ఈఈ ప్రవీణ్, డిఈ దేవిశ్రీ గురువారం బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాగు పరిసర ప్రాంతాలను,నిర్మాణానికి అవసరమైన స్థల వివరాలను కాంట్రాక్టర్ రవి,స్థానిక సర్పంచ్ భూక్యా లింగ నాయక్‌తో చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ లింగ నాయక్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా శాశ్వత బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామీణులు,రైతులు,విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.టెండర్ ప్రక్రియ పూర్తయినందున తదుపరి చర్యలు వేగవంతం చేసి,పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే కోయగూడెం,పరిసర గ్రామాల ప్రజల రవాణా కష్టాలు తీరుతాయని ,రైతులకు,ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో ఐటీడిఏ ఏఈ శ్రీనివాస్,ఉపసర్పంచ్ గొంది రాంబాబు,వార్డు సభ్యులు మంగీలాల్,వీరు, భజ్య,రాంబాబు, గ్రామ పెద్దలు భాస్కర్,రాము,దేవదాస్, నాగేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ గేమ్స్ లో ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ.

### -జోనల్ స్థాయికి ఎంపిక.



**బయ్యారం/,సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండల స్థాయిలో ఈ నెల 7, 8 తేదీలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో ఇర్సులాపురం ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మహబూబాబాద్ జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.వాలీబాల్ జూనియర్,సీనియర్ విభాగాల్లో పాఠశాల జట్లు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి.ఖో-ఖో జూనియర్ విభాగం నుండి నలుగురు, సీనియర్ విభాగం నుండి ముగ్గురు విద్యార్థులు జోనల్ స్థాయికి ఎంపికయ్యారు.కబడ్డీ సీనియర్ విభాగం నుండి ముగ్గురు విద్యార్థులు జోనల్‌కు ఎంపికయ్యారు.పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన విజేతలను, వారికి శిక్షణనిచ్చిన పిడి వాలు ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు,ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.జోనల్ స్థాయిలో కూడా ప్రతిభ చూపి పాఠశాలకు మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఎల్‌ఎండీ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలి

### ఆత్మ డైరెక్టర్ వంగల వెంకటరెడ్డి



**హుజురాబాద్/ సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్‌ఎండీ దిగువ ఆయకట్టు కింద సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే సాగునీరు విడుదల చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా ఆత్మ డైరెక్టర్ వంగల వెంకటరెడ్డి కోరారు. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి రైతులు పంటలు సాగు చేశారని తెలిపారు.వర్షాకాలం అయినా ఆశించిన స్థాయిలో వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటాయని, బోరుబావుల్లో నీరు లేక పంటలు చివరి పొట్ట దశలో ఉన్నాయని పేర్కొన్నారు. లోయర్ మానేరు డ్యాం నుంచి కనీసం రెండు వారాలపాటు సాగునీరు విడుదల చేస్తే పంటలు చేతికొచ్చే అవకాశం ఉందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబులు స్పందించి సాగునీటి విడుదలకు కృషి చేయాలని వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఎన్‌ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ ఇమ్రాన్



**హుజురాబాద్/ సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):**
ఎన్‌ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ ఇమ్రాన్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఏడవల్లి వెంకట్‌స్వామి ఉత్తర్వులు జారీ చేశారు.కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఇమ్రాన్.. కళాశాల అధ్యక్షుడిగా, ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా పలు బాధ్యతలు నిర్వహించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే ఎన్నికల ఇన్‌చార్జిగా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్‌గా సేవలందించారు.గత పదేళ్లుగా విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న తన సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఏడవల్లి వెంకట్‌స్వామికి ఇమ్రాన్ కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆర్‌టీఏ సభ్యుడు పడాల రాహుల్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబులకు ధన్యవాదాలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీకి, ఎన్‌ఎస్‌యూఐకి అంకితభావంతో పనిచేస్తానని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఇమ్రాన్ తెలిపారు. ఎన్‌ఎస్‌యూఐని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

## దళితబంధు పెండింగ్ లబ్ధిదారుల కోసం రిలే దీక్ష

### గోడపత్రిక ఆవిష్కరణ



**హుజూరాబాద్ /సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):**
దళితబంధు రెండో విడత పెండింగ్ లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించనున్న రిలే నిరాహార దీక్ష గోడపత్రికను టీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎనుగు మల్లారెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ రక్షణ సేన నాయకుడు బండ అశోక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సంతోష్ కుమార్ యాదవ్, కోరపల్లి సురేష్, అంబాల హరీష్, కిరణ్, నరేష్, రితీష్ తదితరులు హాజరయ్యారు.దళితబంధు రెండో విడత పెండింగ్ లబ్ధిదారులకు అండగా నిలిచేందుకే రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. దళితబంధు ఎవరి భిక్ష కాదని, అది దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ నెల 12న అంబేద్కర్ చౌరస్తాలో జరిగే దీక్షకు లబ్ధిదారులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## క్రీడల్లో కృష్ణవేణి టాలెంట్ విద్యార్థుల సత్తా



**కాజీపేట/సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):**కాజీపేట డీజిల్ కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. ఫాతిమానగర్‌లోని ఫాతిమా ఎయిడెడ్ హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండలస్థాయి ఎంపిక పోటీల్లో అండర్-17 విభాగంలో ఎస్.లోకేష్ కబడ్డీ, ఎస్.అవినాష్ ఖోఖోలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.హనుమకొండలో నిర్వహించనున్న జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ నుజహత్, వైస్ ప్రిన్సిపాల్ సాజిద్, పీఈటీ ఎన్.సురేష్‌తో పాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

## వరంగల్ జిల్లా సీ పీ ఐ పార్టీ కౌన్సిల్ సభ్యుడు ఆరేళ్లి ప్రభాకర్



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 10(జర్నలిస్ట్ వార్త):** భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని వరంగల్ జిల్లా సీ పీ ఐ పార్టీ కౌన్సిల్ సభ్యుడు ఆరేళ్లి ప్రభాకర్ అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం అంబేద్కర్ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆమె ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వర్ధన్నపేట మండల కార్యదర్శి బొడ్డుపల్లి సాయిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఐ శ్రీనివాస్‌కు రాజారపు సుమన్ శుభాకాంక్షలు




**ధర్మసాగర్/ సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ ధర్మసాగర్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు సుమన్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడంలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతలకు ప్రాధాన్యమిస్తూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎలాంటి సమస్య ఎదురైనా ప్రజలు పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడల్లో కృష్ణవేణి టాలెంట్ విద్యార్థుల సత్తా



**కాజీపేట/సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):** కాజీపేట డీజిల్ కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. ఫాతిమానగర్‌లోని ఫాతిమా ఎయిడెడ్ హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండలస్థాయి ఎంపిక పోటీల్లో అండర్-17 విభాగంలో ఎస్.లోకేష్ కబడ్డీ, ఎస్.అవినాష్ ఖోఖోలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హనుమకొండలో నిర్వహించనున్న జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ నుజహత్, వైస్ ప్రిన్సిపాల్ సాజిద్, పీఈటీ ఎన్.సురేష్‌తో పాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

# మహిళల భద్రత,సైబర్ నేరాలపై అవగాహన

## -డీఎస్పీ తిరుపతి రావు.



**బయ్యారం/,సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)** సైబర్ నేరాలు,మూఢనమ్మకాలు, ఆన్‌లైన్ గేమింగ్ దుష్ప్రభావాలు,రోడ్డు భద్రత, గుట్కా, బాల్యవివాహాల నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశానుసారం కళాజాగృతి బృందం ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేట పంచాయతీలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎస్పి తిరుపతి రావు మాట్లాడుతూ గంజాయి,ఇతర మాదక ద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యం,భవిష్యత్తు, విద్య,ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తులు కుటుంబానికి, సమాజానికి భారంగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని,ఇవి పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తాయని డిఎస్పి పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్,సీటు బెల్టు ధరించాలని సీఐ రవీందర్ అన్నారు. ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే గుట్కా,ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,మత్తుపదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ ప్రశాంత్ బాబు స్పష్టం చేశారు. ప్రజలందరూ చట్టాలపై అవగాహన పెంచుకొని, బాధ్యతాయుతంగా ప్రవర్తించి సన్మార్గంలో పయనించాలని సర్పంచ్ ప్రవీణ్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు,ప్రజాప్రతినిధులు,పోలీసు సిబ్బంది,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్టు సాగులో నిర్లక్ష్యం వద్దు.. లాభాలే లక్ష్యం!

## శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు -రైతులకు జేడీ అనసూయ, శాస్త్రవేత్త వజ్రమ్మ రైతులకు సూచనలు





**భీమదేవరపల్లి/హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 10 (జర్నలిస్ట్ వార్త):** పట్టుపరిశ్రమలో రైతులు నిర్లక్ష్యానికి తావిస్తే పెట్టుబడి పెరిగి. దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, శాస్త్రీయ పద్ధతులతో సాగు చేస్తేనే ఆశించిన లాభాలు అందుతాయని హనుమకొండ జిల్లా పట్టుపరిశ్రమ శాఖ సంయుక్త సంచాలకురాలు అనసూయ అన్నారు. రైతులు పాత పద్ధతులకు స్వస్తి పలికి శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని స్పష్టం చేశారు. నా పట్టునా గర్వం రెండో విడత కార్యక్రమంలో భాగంగా గురువారం ముల్కనూర్ సహకార సంఘంలో రైతుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, మల్బరీ తోటలను నిర్లక్ష్యం చేస్తే పట్టుపురుగులకు నాణ్యమైన ఆహారం అందక దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. తక్కువ భూమిలో ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉన్న



పట్టుపరిశ్రమను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్న తప్పిదం. పెద్ద నష్టంమైసూరు కేంద్ర పట్టు పరిశోధన, శిక్షణ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ వజ్రమ్మ మాట్లాడుతూ పట్టుపురుగుల పెంపకంలో చిన్న నిర్లక్ష్యమే పెద్ద నష్టానికి దారితీస్తుందని హెచ్చరించారు. నాణ్యమైన మల్బరీ ఆకు, పరిశుభ్రమైన పెంపకం, సకాలంలో వ్యాధుల గుర్తింపు అత్యంత కీలకమన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే అధికారులను సంప్రదించాలని సూచించారు. మల్బరీ సాగులో నీరు, ఎరువుల యాజమాన్యాన్ని శాస్త్రీయంగా నిర్వహించాలని తెలిపారు. మిగిలిన మల్బరీ ఆకులను పశువులకు మేతగా వినియోగించుకోవడం ద్వారా రైతులు అదనపు ప్రయోజనం పొందవచ్చన్నారు.

కార్యక్రమంలో ములుగు ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ తిరుపతి రెడ్డి, హనుమకొండ జిల్లా పట్టు పరిశ్రమ అధికారి కమలాకర్ రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ప్రతినిధి శంకర్, భీమదేవరపల్లి వ్యవసాయ అధికారి పద్మ, జిల్లా సమన్వయ అధికారి సంజీవ రెడ్డి, వరంగల్ సహాయ సంచాలకుడు తిరుపతి రెడ్డి,వరంగల్‌హనుమకొండ పట్టు పరిశ్రమ అధికారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. సుమారు వంద మంది రైతులు పాల్గొని శాస్త్రవేత్తలు, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ప్రగతిశీల పట్టు రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు.

# రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి

## : అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి సెప్టెంబర్ 9:సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)** "గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు.

రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రారంభమైన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రెండు రోజుల పాటు మొత్తం 12 గంటల పాటు సాగే ఈ కీలక సదస్సులో తొలిరోజు, పాలనలో తీసుకురావాల్సిన మార్పులు, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్'.. ఇదే మన మిషన్**

ప్రజా సేవకులుగా అహంభావాలకు తావివ్వకుండా పనిచేయాలని సూచించిన ముఖ్యమంత్రి, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలంటే ముందుగా యాజమాన్య బాధ్యత (ఓనర్‌షిప్) తీసుకోవడం అలవర్చుకోవాలని హితవు పలికారు. "ఫైల్ పెండింగ్‌లో ఉందంటే అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే. ఫిర్యాదు పెండింగ్‌లో ఉందంటే ప్రజలకు న్యాయం ఆలస్యమవుతున్నట్టే. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు, వాస్తవాలు నిర్భయంగా చెప్పండి. సమస్యను దాచిపెడితే అది పెద్దదవుతుంది, కానీ దానిపై బహిరంగంగా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలి. ఇందుకోసం శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్లు ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీపడాలి. 'వన్




స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'... ఇదే మనందరినీ స్వర్ణాంధ్ర లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

**'సీఈఓ' కన్నా 'వాటర్ మ్యాన్' గుర్తింపే ఆనందం**

ఈ సందర్భంగా, సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఎకనమిక్ టైమ్స్ పత్రిక ముఖ్యమంత్రిని 'సీఈఓ టు వాటర్‌మ్యాన్' అంటూ ప్రచురించిన కథనాన్ని ప్రస్తావించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు, ఆ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు.

"గతంలో గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు గానీ, నన్ను సీఈఓ సీఎం అన్నప్పుడు గానీ నేను ఇంతలా సంతోషించలేదు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు, భౌగోళిక అసమానతల కారణంగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని అందించగలిగినప్పుడే నాకు నిజమైన సంతృప్తి. ఆ నీటి భద్రత, సంరక్షణ చర్యలను గుర్తించి 'వాటర్ మ్యాన్' అని పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు.

ఈ వ్యాఖ్యల అనంతరం సాగునీటి రంగంలో ముఖ్యమంత్రి కృషికి అభినందనగా సమావేశంలో ఉన్న కలెక్టర్లు, అధికారులు, మంత్రులు లేచి నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) గౌరవం తెలిపారు.

**టీమ్ విజయంతోనే అభివృద్ధి సాధ్యం**

గడిచిన 27 నెలల్లో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టామని, రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామని సీఎం వివరించారు. "హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లిచ్చాం. పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఈ విజయాలన్నీ ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు. ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఒక జట్టుగా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది. ఇది టీమ్ సక్సెస్" అని చంద్రబాబు పేర్కొన్నారు.

**అవకాశాలను అందిపుచ్చుకుని, నకిలీ ప్రచారాలను తిప్పికొట్టాలి**

ప్రతి జిల్లాలో 25 ప్రధాన ప్రాజెక్టులను, ప్రతి నియోజకవర్గంలో 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించి వాటిని పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశించారు. జిల్లాలో 'గ్రోత్ ఇంజన్లను' గుర్తించి సంపద సృష్టించాలని సూచించారు. "టెక్నాలజీని అందిపుచ్చుకుని 'డీప్ టెక్ గవర్నెన్స్' ద్వారా నిర్ణయాల్లో వేగం, సేవల్లో నాణ్యత పెంచాలి. కొందరు పనిగట్టుకుని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. వాటిని వెంటనే గుర్తించి, వాస్తవాలతో తిప్పికొట్టాలి. డీఎస్సీ-2025 విషయంలో ఇద్దరు మహిళా అధికారులు సమర్థంగా స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచారు. వారిని అభినందిస్తున్నాను" అని సీఎం అన్నారు. గత ప్రభుత్వ హయాంలోని 'జే బ్రాండ్' మద్యం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదని, తాము కల్తీ బ్రాండ్లను రద్దు చేసి పారదర్శకత తీసుకొచ్చామని తెలిపారు.

# ఏపీ మద్యం కేసులో రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**మద్యం కుంభకోణం తీవ్ర ఆర్థిక నేరమన్న సుప్రీంకోర్టు**

**ఈడీతో పాటు రాష్ట్ర విచారణ బృందాల దర్యాప్తు సమాంతరంగా సాగడంలో తప్పు లేదని వ్యాఖ్య**

**బెయిల్ పిటిషన్ ను తిరస్కరించిన ధర్మాసనం**



**అమరావతి సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సర్వోన్నత న్యాయస్థానంలో తీవ్ర విఘాతం ఎదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వారు దాఖలు చేసిన పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఈ సందర్భంగా కేసు తీవ్రతను ప్రస్తావించిన సీజేఐ... ఇది తీవ్రమైన ఆర్థిక నేరమని వ్యాఖ్యానించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన ఆర్థిక అక్రమాల కేసుతో పాటు రాష్ట్ర పోలీసుల ప్రత్యేక విచారణ బృందాల (సిట్, సీఐడీ) దర్యాప్తు ఒకే సమయంలో సమాంతరంగా సాగడంలో తప్పులేదని కోర్టు తేల్చిచెప్పింది. నిందితులు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నారని న్యాయవాదులు తెలుపగా... ఈడీ కస్టడీ పూర్తయిన తక్షణమే సిట్ కస్టడీకి అప్పగించేలా ప్రొడక్షన్ వారెంట్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించింది.

ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనం... సిట్ విచారణ ప్రక్రియ ముగిసిన అనంతరం నిందితులు సంబంధిత కింది కోర్టులోనే రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. కేసుకు సంబంధించిన అంశాలు, మెరిట్స్ ఆధారంగా మాత్రమే ఆ బెయిల్ దరఖాస్తును కింది కోర్టు పరిశీలిస్తుందని స్పష్టం చేసింది.

# మెగా డీఎస్సీ ప్రక్రియలో భారీ అవకతవకలు :జగన్

**అమరావతి సెప్టెంబర్ 10.(జర్నలిస్ట్ వార్త)** ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ మరోసారి ఆరోపించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు.

ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని జగన్ ప్రశ్నించారు. ఎస్‌సీఈఆర్‌టీ విభాగంలో పనిచేస్తున్న నవీన్ అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది? అసలు మొదటి ర్యాంక్ సాధించిన నవీన్‌కు ఉద్యోగం ఎందుకు నిరాకరించారు? అని ప్రశ్నించారు.



జీవో నంబర్ 4, జీవో నంబర్ 47లను తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు? పరీక్షలు నిర్వహించకుండానే 372 మందికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అని ప్రశ్నించారు. 'జూడో' అనే ఆట కింద ఏకంగా 39 మందికి అక్రమంగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు.

మెగా డీఎస్సీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలతో సహా నిలదీస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోపం వచ్చి బీపీ పెరుగుతోందని, మంత్రి నారా లోకేశ్‌ను కాపాడుకోవడానికి ప్రభుత్వం తాపత్రయపడుతోందని జగన్ ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.